కాంగ్రెస్‌కు ఆదరణ కరువు: కిషన్‌రెడ్డి



పద్మాకాలనీలో జరిగిన ముఖాముఖిలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: దేశప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అది ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమని భావిస్తున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఆదరణ కరువైందని సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మోదీ గత పదేళ్లుగా అవినీతి రహిత పాలన అందిస్తున్నారని, సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా దేశ సమగ్రత, సమైక్యతను కాపాడారని అన్నారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మాకాలనీవాసులు, ముషీరాబాద్ డివిజన్‌లోని అరుణ సొసైటీ సభ్యులు, రాంనగర్ డివిజన్‌లోని జెమిని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలు బట్టలు మార్చినట్లు రాజకీయ నాయకులు రోజుకో పార్టీ మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు మాదిరిగా అభివృద్ధి చేసేందుకు ప్రధాని రూ.720 కోట్లు మంజూరు చేశారన్నారు. ఓల్డ్‌సిటీ మాదిరిగా న్యూసిటీలో కూడా ఓటింగ్ శాతం భారీగా పెరగాలని సూచించారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రమేష్ రామ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు నరేష్, కౌనిన్యప్రసాద్, సాయికృష్ణయాదవ్, శేషసాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు వేలాదిగా తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపు

ముషీరాబాద్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ బహిరంగసభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి వేలాదిగా జనం తరలిరావాలని సికింద్రాబాద్ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బ్లాక్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నేతల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి కార్లలో ర్యాలీగా బయలుదేరి సాయంత్రం 4 గంటలకు తుక్కుగూడ చేరుకుంటారని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 17 పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ గెలవాలనే సంకల్పంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ, బీ-బ్లాక్ అధ్యక్షులు వీడీ కృష్ణా, అంజియాదవ్, గుర్రం శంకర్, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనయాదవ్, వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు వెంకటగోవిందరావు, జానకీసుధాకర్, మారిశెట్టి నర్సింగ్‌రావు, అంజిరెడ్డి, మనోహర్‌సింగ్, మల్లికార్జున్‌రెడ్డి, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, లింగంగుప్తా, జి.ఎస్.చారి తదితరులు పాల్గొన్నారు.

010 పద్దు కింద పింఛన్లు చెల్లించాలి



రియాజ్‌ను సన్మానిస్తున్న దేవేందర్, సోమశివయ్య

చిక్కడపల్లి: తెలంగాణ గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్, ప్రధానకార్యదర్శి సోమశివయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నూతన చైర్మన్ డాక్టర్ ఎండి రియాజ్‌ను కార్యాలయంలో బుధవారం కలిసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం 010 పద్దు కింద వేతనాలు, పింఛన్‌లను చెల్లించాలని కోరారు. హెల్త్ కార్డులను జారీ చేయాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీల్లో పదవీ విరమణ పొందిన గ్రంథాలయ సిబ్బందిని కమిటీ సభ్యులుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి బుచ్చయ్య, సహకార్యదర్శి వేదకళ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ లో ఏసీపీ రమేష్‌కుమార్, సీఐలు నిరంజన్, సీతయ్య తదితరులు

ముషీరాబాద్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా ఓటింగ్‌లో పాల్గొనాలని చిక్కడపల్లి ఏసీపీ టి.రమేష్‌కుమార్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగేలా అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద భారీ భద్రతాచర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ముషీరాబాద్, దయారా మార్కెట్, పఠాన్‌బస్తీ, జమిస్తాన్‌పూర్, ఫిష్‌మార్కెట్, రాంనగర్ చౌరస్తా, ఈసేవా వరకు పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ జరిగింది. ఈ మార్చ్‌లో ముషీరాబాద్, చిక్కడపల్లి పోలీసు అధికారులతోపాటు సాయుధ బలగాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ, అసాంఘికచర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, చిక్కడపల్లి సీఐలు, నిరంజన్, సీతయ్య, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తోపాటు ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సరదాగా యోగా..

పతకాలే తేగా!

- జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన డీఎస్పీ లక్ష్మి
- పోలీస్ విభాగం సహకారంతో విజయాలు సొంతం
- పోటీలకు ముందు 40 రోజులు కఠోర సాధన

అంబర్‌పేట్: నిత్యం ఒత్తిడులతో కూడిన ఉద్యోగ జీవితంలో సరదాగా మొదలు పెట్టిన యోగా ఆమెకు జాతీయస్థాయిలో పతకాలు తెచ్చిపెట్టింది. ఆమె పనిచేసే పోలీసు శాఖకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చింది. యోగాసనాల్లో ఆమె చురుకుదనం ఉన్నతాధికారుల మన్ననలు పొందింది. ఆమే తుమ్మల లక్ష్మి. 1996లో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన లక్ష్మి ప్రస్తుతం డీఎస్పీగా అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. సుదీర్ఘకాలంగా అవినీతి నిరోధక శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఆమె విధులు నిర్వహించి పోలీసు బాస్‌లచేత శభాష్ అనిపించుకున్నారు. ఆమె విధులపట్ల చూపిన అంకితభావం, చొరవ, ఎదుర్కొన్న సవాళ్లు వంటి అనుభవాల నేపథ్యంలో 800 మందికిపైగా శిక్షణ పొందుతున్న పోలీస్ అభ్యర్థులకు స్ఫూర్తిదాయకమైన పాఠాలు చెబుతోంది.



డీఎస్పీ లక్ష్మిని అభినందిస్తున్న డీజీపీ రవిగుప్త



యోగాసనాలు చేస్తున్న డీఎస్పీ తుమ్మల లక్ష్మి

20 ఏళ్ల క్రితం ఫిట్‌నెస్ కోసం...

20 ఏళ్ల క్రితం ఫిట్‌నెస్ కోసం లక్ష్మి సరదాగా యోగా నేర్చుకున్నారు. అప్పటి నుంచి యోగా క్రమం తప్పకుండా చేస్తూ అందులో ప్రావీణ్యం సాధించారు. జాతీయస్థాయిలో పోలీస్ సాయుధ బలగాల కోసం క్రీడా పోటీలు జరుగుతుంటాయి. తొలిసారిగా 2015లో నిర్వహించిన క్రీడల్లో యోగాను చేర్చారు. 2016లో రాష్ట్రం తరఫున లక్ష్మి పాల్గొని కాంస్య పతకం సాధించారు. 2017లో నిర్వహించిన పోటీల్లో వెండి, 2022లో బంగారు, 2024లో కాంస్య పతకాలను సాధించారు. దీంతో రాష్ట్ర పోలీస్ విభాగం ఆమెను ప్రత్యేకంగా అభినందించి పలు పురస్కారాలతోపాటు నగదు ప్రోత్సాహకాలను అందించి అభినందించింది.



పతకంతో డీఎస్పీ లక్ష్మి

ఇష్టంతో చేస్తే లక్ష్యం సులువు

పని ఏదైనా ఇష్టపడి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చు. జాతీయస్థాయి పోలీసు విభాగం పోటీల్లో యోగా కోసం 40 రోజులపాటు కఠోరంగా ప్రాక్టీస్ చేస్తాను. పోలీస్ అధికారి అయిన నా భర్త ప్రోత్సాహంతో విజయాలు సాధ్యమవుతున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు సహితం తన ప్రతిభను గుర్తించి అందిస్తున్న సహకారం నా విజయానికి కారణం. – డీఎస్పీ లక్ష్మి

టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌రాజు

ముషీరాబాద్: ఎంపీ టికెట్ల కేటాయింపులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు అన్నారు. బుధవారం సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క మాదిగకు కూడా ఎంపీ టికెట్ కేటాయించకపోవడం చాలా బాధాకరమన్నారు. మాదిగలకు ఎంపీ టికెట్లు కేటాయించకపోతే కాంగ్రెస్ పార్టీకి మాదిగ జాతి గుణపాఠం చెప్తుందన్నారు. సమావేశంలో నల్లగడ్డ నర్సింహ్మ, కె.నాగరాజు తదితరులున్నారు.

నేడు కృష్ణానగర్‌లో మజ్జిగ పంపిణీ



పగిడి విజయలక్ష్మీ

కాచిగూడ: కృష్ణానగర్ బస్తీ పంచ్ కమిటీ అధ్యక్షుడు, దళితరత్న పగిడి యాదగిరి సతీమణి, ప్రముఖ సంఘసేవకురాలు విజయలక్ష్మీ 2వ వర్ధంతి సందర్భంగా పగిడి యాదగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉదయం కృష్ణానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పగిడి సత్యవీర్ పాండు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరావు

కాచిగూడ: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణ గల సైనికుల వలే కృషి చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేపట్టాలని సూచించారు.సంక్షేమ పథకాలతో లబ్ధిపొందినవారిని స్వయంగా కలవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరత్, యాదగిరి రెడ్డి, పవన్ కుమార్, సుమంత్ పాల్గొన్నారు.

పార్టీ జెండా ఎగరాలి'

కాచిగూడ: ఈ నెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటిపై పార్టీ జెండా ఎగరవేయడంతోపాటు టిఫిన్ బాక్స్ కార్యక్రమం ప్రతి పోలింగ్ బూత్‌లో నిర్వహించాలని డాక్టర్ ఎన్.గౌతంరావు సూచించారు. బీజేపీ గోల్నాక డివిజన్ పోలింగ్ బూత్‌స్థాయి కో ఆర్డినేటర్లు, అధ్యక్షులు, ప్రధానకార్యదర్శు లు, ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగింది. డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జి.ఆనంద్‌గౌడ్, ఎ.వినయ్‌కుమార్, ఎం.సామ్రాజ్, లక్ష్మీనారాయణ, కేసరి నర్సింగ్ యాదవ్, ఆర్ఎల్ రమేష్, కె.రవీందర్, ఎం.కృష్ణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, మహ్మ ద్ సలీం, దామోదర్ నాయుడు, మహ్మద్ ఖాజా, ఎస్.శ్రీధర్ గౌడ్, ఎస్.రాజేశ్, శోభాచందర్, స్వప్నప్రియ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో విద్యారంగం: హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యారంగం సంక్షోభంలో పడిపోయిందని అఖిల భారత విద్యాహక్కుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత విద్యాహక్కుల వేదిక, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రూపొందించిన పీపుల్స్ మేనిఫెస్టోలోని విద్యారంగ డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ పేద వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. విద్యారంగంపట్ల, పేద వర్గాల పట్ల రాజకీయ నాయకులకు చిత్తశుద్ధి లేదని తెలిపారు. దళిత, గిరిజనులకు చదువు చెప్పించాలనే ఆలోచన లేని బీజేపీ వర్గ, కుల, ఫాసిస్టు సమాజాన్ని కోరుకుంటోందని విమర్శించారు. ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ మాట్లాడుతూ విద్యా రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించినవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. కాలేజీ, స్కూల్స్, యూనివర్సిటీల్లో సామాజిక వివక్ష కొనసాగుతోందని, దీనికి వ్యతిరేకంగా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు పి.మహేష్, కె.ఎస్.ప్రదీప్, అల్లూరి విజయ్, ఎం.సోమయ్య, రవికుమార్, బి.కృష్ణా, గడ్డం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ పక్షపాతి కిరణ్



కిరణ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐఎఫ్‌టీయూ అనుబంధ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన వడ్లకొండ కిరణ్ కార్మికవర్గ పక్షపాతి అని రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేముల రామయ్య అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో కిరణ్ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ కిరణ్ కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. కిరణ్ భౌతికంగా లేకపోయినా, ఆయన ఇచ్చిన పోరాటస్ఫూర్తిని ముందుకు తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత శ్రీకాంత్, ఏఐటీయూసీ నాయకుడు వెంకటేష్, ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నాయకులు నరేందర్, కలాముద్దీన్ తదితరులున్నారు.

నియామకం



సంజయ్‌కుమార్ అగర్వాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కవాడిగూడ: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) చిక్కడపల్లి నగర్ అధ్యక్షుడిగా కవాడిగూడ డివిజన్ దోమలగూడకు చెందిన సంజయ్ కుమార్ అగర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని బుధవారం వీహెచ్‌పీ విద్యా నగర్ జిల్లా కార్యదర్శి అజయ్‌రాజ్, భజరంగ్‌దళ్ విద్యా నగర్ జిల్లా సంయోజక్ (అధ్యక్షుడు) అభిషేక్ కలిసి దోమలగూడలో ప్రకటించారు. వీహెచ్‌పీతోపాటు భజరంగ్‌దళ్‌ను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి భజరంగ్‌దళ్ అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు వినయ్, నాయకులు మోహన్ కృష్ణ, రమేష్, సతీష్, భాను, వంశీ, హరికృష్ణ, హరినాథ్, ఫణీందర్, రాఘవేంద్రతోపాటు కార్యకర్తలు సంజయ్‌కుమార్ అగర్వాల్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల వేళ.. ప్రచారరథాలు భళా!

- ఏపీ, తెలంగాణలోని రాజకీయ పార్టీల ఆర్డర్లు
- కూలీలకు ఉపాధిగా మారిన ప్రచారరథాల తయారీ
- ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధం చేస్తున్న చిన్నా సినీఆర్ట్స్



ఎన్టీఆర్ స్టేడియంలో ప్రచార రథాల తయారీలో నిమగ్నమైన కార్మికులు

కవాడిగూడ: పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రచారరథాలకు డిమాండ్ పెరిగింది. మే 13న ఎన్నికలు జరగనున్న సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రచారరథాలను సిద్ధం చేసుకుంటున్నాయి. నగరంలోని ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియం ప్రచార రథాల తయారీకి కేంద్రంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల ఎంపీ అభ్యర్థులతోపాటు ఏపీలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసే వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార రథాలను తయారు చేయించుకున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల గుర్తుతో పార్టీ ముఖ్య నేతల ఫొటోలతో ప్రచారరథాలను ముస్తాబు చేయిస్తున్నారు.

ఎన్టీఆర్ హయాం నుంచి...

ప్రచారరథాలను దోమలగూడలోని చిన్నా సినీ ఆర్ట్స్ సంస్థ తయారు చేసి అందిస్తోంది. అయితే ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెయింటింగ్‌లు, కటౌట్‌లు చేసి ఇచ్చేవారమని చిన్నా సినీ ఆర్ట్స్ అధినేత చందర్‌రావు తెలిపారు. ఒక టాటా ఏస్ వాహనాన్ని ఎన్నికల ప్రచారానికి అనువుగా నాలుగు వైపులా మైకులు, బ్యాటరీ, ఇద్దరు వ్యక్తులు అందులో ఉండేవిధంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా డీసీఎం వాహనంపై నాలుగు మైకులు, కళాకారులు నృత్యాలతో పాటలు పాడే విధంగా సిద్ధం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రధాన చౌరస్తాలు, బహిరంగ సభల్లో మాట్లాడే విధంగా రథాన్ని తయారు చేస్తున్నారు. దీనికిగాను వాహనంలో ఒక జనరేటర్, బ్యాటరీ, నాలుగు మైకులు సమకూరుస్తున్నారు. ఒక్కో టాటా ఏస్ వాహనం ప్రచార రథంగా మార్చడానికి నలుగురు కూలీలు మూడు రోజులపాటు కష్టపడాల్సి వస్తోంది. కార్మికులకు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఇస్తూ జీవనోపాధి కల్పిస్తున్నారు.







ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్న వివిధ పార్టీల ఎన్నికల ప్రచార రథాలు

5న శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద జన్మదిన వేడుకలు



తాడిపత్రికి వెళ్తున్న ఇందూజ్ఞాన వేదిక సభ్యులు

కాచిగూడ: త్రైత సిద్ధాంత ఆదికర్త, ఇందూ జ్ఞానధర్మ ప్రదాత, శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారి జన్మదిన వేడుకలు ఈ నెల 5న శుక్రవారం ఏపీలోని అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉన్న శ్రీ కృష్ణ మందిరంలో జరుగుతాయని ఇందూ జ్ఞానవేదిక సభ్యులు తెలిపారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి వందలాది మంది భక్తులు తాడిపత్రికి తరలివెళ్లారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తెలంగాణ ప్రాంత ప్రతినిధులు గిరి, రవీందర్‌రెడ్డి, దేవేందర్, పంచాక్షరి, శ్రీనాథ్ శ్రేష్టి, రాకేష్, రాజు, ఓంప్రకాష్, నిరంజన్, వెంకట్, కృష్ణవేణి, వేణు, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

'దళితబంధు' అవకతవకలపై ఫిర్యాదు



అరవింద్ కుమార్‌యాదవ్

ముషీరాబాద్: బీఆర్ఎస్ హయాంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు, మైనార్టీబంధు, బీసీబంధు లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై ఇప్పటికే హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. తమకు అందిన ఫిర్యాదుల ప్రకారం బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు, దళితులు కానీ వారికి దళితబంధు పథకాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందించారని, కుల సర్టిఫికెట్లను కూడా తప్పుగా జతపరిచి లబ్ధిపొందారని ఆరోపించారు. ఈ విచారణలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఎమ్మెల్యే ముఠా గోపాల్, అప్పటి అధికారులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టే విధంగా కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు.

'అన్నివర్గాలు బీజేపీకి అండగా నిలవాలి'



లబ్ధిదారులతో కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.ఇందిర కోరారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్లబస్తీ, చిత్రాల నగర్, ఉన్నికోట బస్తీలలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలిసి మరోసారి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రంగరాజుగౌడ్, జి. వెంకటేష్, మద్దెల చంద్రయ్య, రాఘం రమేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



అల్పాహారం పంపిణీ చేస్తున్న వరాళనికౌశిక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సామాజికవేత్త జ్వాలా వరాళినికౌశిక్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్‌జీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పేదలు, విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరాళినికౌశిక్ మాట్లాడుతూ ఫౌండేషన్‌ల ద్వారా నిత్యం పేదలకు అల్పాహారం పంపిణీ, అన్నదానం, ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కందూరి కృష్ణ, ప్రమోద్ అగర్వాల్, అడ్వకేట్ హెచ్.గోవింద్‌రావు, డాక్టర్ సంగీత, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా హెచ్‌బీఏ 1సీ పరీక్ష

చిక్కడపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్‌సిటీ శ్రీ సాయి డయాగ్నొస్టిక్ సెంటర్, తులిప్ డయాగ్నొస్టిక్ సంయుక్తంగా హెచ్‌బీఏ 1సీ పరీక్షను గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఉచితంగా నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ చైర్మన్ లయన్ డాక్టర్ జీకే రమణ ఒక ప్రకటనలో తెలిపారు. చిక్కడపల్లిలోని శ్రీ సాయి డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 040-27607687 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హాస్టల్‌లో అడ్మిషన్ తీసుకున్న రోజే బాలుడు అదృశ్యం



తిలక్‌రాజ్

చిక్కడపల్లి: హాస్టల్‌లో అడ్మిషన్ తీసుకున్న రోజే ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం... రాణిగంజ్ గాస్‌మండి ప్రాంతంలో నివసించే ప్రయివేట్ ఉద్యోగి గల్లిపల్లి శివానంద్‌కు తొమ్మిదేళ్ల కుమారుడు తిలక్‌రాజ్ ఉన్నాడు. కాగా శివానంద్ మొదటి భార్య సమత 2021లో చనిపోవడంతో కుమారుడిని హాస్టల్‌లో వేయాలని భావించాడు. ఈ క్రమంలో గత పదిహేనురోజులుగా చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంతంలో నివసించే భార్య స్నేహితురాలి వద్ద ఉంచాడు. తిలక్‌రాజ్‌ను ఈ నెల 2న హాస్టల్‌లో చేర్పించడానికి అడ్మిషన్ కూడా తీసుకున్నారు. అయితే 2వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి తిలక్‌రాజ్ కనిపించకుండాపోయాడు. బాబు కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శివానంద్ చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన

హిమాయత్‌నగర్: సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా మోసాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. బుధవారం సైబర్ క్రైమ్ సీఐ కే.సైదులు ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లోని పలు హాస్టళ్ల వద్ద విద్యార్థులు, యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ, డెబిట్, క్రెడిట్, పెట్టుబడి, పార్ట్ టైమ్ జాబ్స్, ఫెడెక్స్, సోషల్ మీడియా తదితర మోసాలు పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అధిక లాభాలకు ఆశపడి వ్యాపారం, పెట్టుబడి, పార్ట్‌టైమ్ ఉద్యోగాల్పుపై సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో వచ్చే సందేశాలు, లింక్‌లు ఓపెన్ చేసి వాటి ద్వారా డబ్బు పెట్టుబడి పెట్టవద్దని సూచించారు.